www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 జులై 2025

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పి- 4 కింద పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలను గుర్తించి వెంటనే రిజిస్టర్ చేయించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కార్యక్రమం ద్వారా నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో పి-4 , స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి పలు సూచనలను జారీ చేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా 3వ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదంతో కార్యక్రమాలు చేయాలనీ ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రతి గ్రామం, వార్డులలో, మండల స్థాయిలో 3వ శనివారం కార్యక్రమాలు నిర్వహించాలని, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు అందుకు తగ్గ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాన్ని ఒక నెలపాటు నిర్వహించాలని డిపిఓను ఆదేశించారు. మండల స్థాయిలో 100 మొక్కలను నాటాలని సూచించారు. ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశంలో పాల్గొనే మహిళలకు ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంపై అవగాహన పెంచాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా క్లాత్ బ్యాగులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పి-4 విధానం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల అభ్యున్నతికి శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి 4 విధానంపై వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో 65 వేల కుటుంబాలను పి-4 కింద గుర్తించడం జరిగిందని, నెల 17, 18 తేదీల్లో సిబ్బందిక శిక్షణ ఇవ్వనున్నారు. 21వ తేదీ నుంచి ఆగస్టు వరకు రీ వెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉందని, ఈ సారి నిజంగా అర్హత కలిగిన పేద కుటుంబాల్నే గుర్తించేలా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే ద్వారా అర్హులైన కుటుంబాలను జాబితాలో చేర్చే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రీవెరిఫికేషన్ పూర్తయ్యాక, తుది జాబితా ఆధారంగా మార్గదర్శుల్ని సంప్రదించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోందన్నారు. జిల్లాకు చెందిన బడా పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలను సంప్రదించి బంగారు కుటుంబాలను ఆదుకోవాలని కోరనున్నారని, గుర్తించిన బంగారు కుటుంబాల్ని దత్తత తీసుకున్న మార్గదర్శులు ఆయా కుటుంబాలకు అవసరమైన విద్య, వైద్యం, మౌలిక వసతుల్ని సమకూర్చనున్నారని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి..

జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా పైప్ లైన్ లీకేజీలు లేకుండా చూడాలని, నీటి కాలుష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని, క్లోరిన్, బ్లీచింగ్ స్ప్రే చేసి పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చూడాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి, డిఎంహెచ్ఓ, ఆర్‌డబ్ల్యు ఎస్ఈ, జిల్లా పరిషత్ సిఈఓలు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, ఎటువంటి సంఘటన జరిగినా వీరే బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఈఓపిఆర్‌డిలు, మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దేవాదాయ శాఖ
భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దేవాదాయ శాఖ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని చిత్తూరు జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 8,770ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయని, అందులో 1,343 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, వీటిని గుర్తించి తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2023వ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 60 ద్వారా ఆలయాల భూములు పరిరక్షించడానికి నూతన కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీలు సభ్యులు జిల్లా స్థాయి ఇంటర్ డిప్టార్‌మెంటల్ కమిటీ సభ్యులుగానూ, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఛైర్మన్‌గా ఉంటారని, అలాగే సభ్యులు జిల్లా పోలీస్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఉంటారని తెలిపారు. ఇందులో సభ్య కార్యదర్శిగా జిల్లా ఎండౌమెంట్స్ అధికారి అసిస్టెంట్ కమిషనర్, సభ్యులుగా జిల్లా రెవెన్యూ అధికారి, సబ్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ డైరెక్టర్ (ల్యాండ్ రికార్డ్స్), జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. అనంతరం డిఆర్ఓ మోహన్ కుమార్ మాట్లాడుతూ కొన్నిచోట్ల దేవాలయ భూములను తక్కువ ధరకు వేలంలో లీజుకి ఇస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. సరైన ధరకు వేలం నిర్వహించి భూములను లీజుకు ఇవ్వాలని ఈవోలను ఆదేశించారు. వివాదాస్పద భూములన్నింటిని సర్వే చెయ్యాలని సూచించారు. జాయింట్ సర్వే పెండింగ్ ఉన్న వాటిని ఆయా శాఖలు సమన్వయంతో 30 రోజులు లోపల పూర్తి చేయాలన్నారు. వన్ బి అడంగల్ పేరు మార్పులను 45 రోజులు లోపల చేయాలని రెవిన్యూ శాఖకు సూచించారు. ఆలయానికి ఆదాయం పెంచాలని, ప్రతి దేవాలయం భూమిని వేలంలో లీజుకు ఇవ్వాలన్నారు. భూములను గుర్తించిన పిదప వాటిని లీజుకు ఇవ్వడం ద్వారా దేవాలయ ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ఎంఎస్-ఎస్ఈ పార్కులు, స్వర్ణ ఆంధ్ర, పీ4 ఫౌండేషన్, సానుకూల ప్రజా అవగాహన, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన, తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో తీసుకుంటున్న చర్యలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సీఎస్ విజయానంద్‌కు తెలియజేశారు. జిల్లాలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగిరి, కుప్పం, జీడీ నెల్లూరు, నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ ప్రత్యేక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన పథకంలో జిల్లాలోని కొన్ని గ్రామాల పనులలో స్థానిక అవసరాల ననుసరించి కొన్ని పనులు మార్పులు చేసి ప్రతిపాదనలు రూపొందించామని, వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 65,451 బంగారు కుటుంబాలు గుర్తించినట్లు వెల్లడించారు. వీటిలో కుటుంబాలను దత్తత తీసుకున్నారని, ఇంకా కుటుంబాలు దత్తత కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గాల వారీగా వివరాలను వెల్లడిస్తూ చిత్తూరు 7,953, గంగాధర నెల్లూరు (ఎస్ సి)11,573, కుప్పం 10,407, నగరి 5135, పలమనేరు 10,106, పుంగనూరు 9,541, పూతలపట్టు 10,736 మొత్తం : 65,451 కుటుంబాలు ఉన్నట్లు వివరించారు. పీ4 కేవలం దాతృత్వ కార్యక్రమం కాదని, గ్రామాలు స్వయం సమృద్ధిని సాధించి, స్వయంగా ఇతర గ్రామాలకు సహాయపడే శాశ్వత సామాజిక ఉద్యమంగా భావించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

చిత్తూరుకు జిఎఫ్‌సిలో స్టార్ రేటింగ్

రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో చిత్తూరు నగరపాలక సంస్థ జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించిందని, జీఎఫ్‌సీ (గార్బేజ్ ఫ్రీ సిటీ)లో మొదటిసారి స్టార్ రేటింగ్ సాధించిందని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షన్ -2024 ఫలితాలను కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిందని, ఈ ఫలితాల్లో జాతీయ స్థాయిలో చిత్తూరు నగరపాలక సంస్థ 273 సాధించినట్లు చెప్పారు. గార్బేజ్ ఫ్రీ సిటీ విభాగంలో సింగల్ స్టార్ రేటింగ్, ఓడిఎఫ్ ప్లస్ సర్టిఫికెట్ సాధించిందన్నారు. 10 లక్షల జనాభా కేటగిరీలో జాతీయ స్థాయిలో 824 నగరాలతో పోటీపడుతూ చిత్తూరు నగరపాలక సంస్థ 273వ సాధించిందని, రాష్ట్ర స్థాయిలో 67 నగరాలతో పోటీపడుతూ 8వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో జాతీయ స్థాయిలో గత ఏడాది 446 నగరాలు పోటీపడగా.. ఈ ఏడాది ఏకంగా 824 నగరరాలు పోటీ పడ్డాయని, జనాభా పరంగా మనకంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలతో దీటుగా పోటీపడుతూ పారిశుద్ధ్యం, ఇంటింటి తడిపొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ నిర్వహణ, ఓడిఎఫ్ ప్లస్, సిటిజన్ ఫీడ్ బ్యాక్ కేటగిరీలో గతంలో కంటే మెరుగైన మార్కులు సాధించింది. స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో మెరుగైన ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందికి, సహకరించిన నగర ప్రజలకు కమిషనర్ నరసింహ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో చిత్తూరు నగరపాలక సంస్థ మెరుగైన ఫలితాలు సాధించడంపై నగరపాలక సంస్థ అధికారులను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 273 ర్యాంకు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా అధికారులకు కృషి చేయాలని, ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని ఎమ్మెల్యే కోరారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో పుంగనూరుకు ఫస్ట్ ర్యాంకు

పుంగనూరు: స్వచ్ఛ సర్వేక్షన్‌లో 2024-25లో చిత్తూరు జిల్లాలో పుంగనూరు మొదటి ర్యాంకు సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25లో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మక అవార్డులు సాధించడంలో పుంగనూరుకు రాష్ట్రంలో 7వ ర్యాంకు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచిందని చెప్పారు. కార్పొరేషన్‌లకు దీటుగా మున్సిపాలిటీలలో మొదటి ర్యాంక్ సాధించి పరిశుభ్రమైన పట్టణంగా మహానగరాలకు దీటుగా నిలిచిందని అన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో విడుదల ఐనా ర్యాంకుల జాబితాలలో పుంగనూరుకు జిల్లాలో మొదటి ర్యాంక్ రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

పలమనేరుకు రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంకు

పలమనేరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ సర్వేక్షన్ 2024-25 సంవత్సరంకు సంబంధించి పలమనేరు పురపాలక సంఘంలో పారిశుధ్య కార్యక్రమాలలో పలమనేరు పురపాలక సంఘంకు జాతీయ స్థాయిలో 386వ ర్యాంకు రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంకు సొంతం చేసుకుందని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలు విధిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్తను తప్పకుండా పారిశుధ్య కార్మికులకు అందిస్తూ పరిశుభ్ర పలమనేరుకు సహకరించాలనీ కోరారు.

చినుకు పడితే చెరువే..

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ప్రజలు

స్కూల్ ముందు నిల్వ చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి- చౌడేపల్లి : కొద్దిపాటి జల్లులు పడితేనే ఆ పాఠశాల ముందు చెరువును తలపిస్తుంది.. విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. చౌడేపల్లి మండలం శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లిలోగల ప్రాథమిక పాఠశాల ముందు కొద్దిపాటి వర్షం పడితేనే వర్షపు నీరు నిల్వ చేరి ఓ చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలతో పాటు పెద్ద ఉప్పరపల్లి వెళ్లే మార్గంలోనూ ఈ దుస్థితి ఉంది. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఆ నీటిలో పాఠశాలలోకి వెళ్లాలంటేనే భయభ్రాంతులకు లోనవుతున్నారు. అధికారులకు తెలిసినప్పటికీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని నీటిని కాలువల ద్వారా వర్షపు నీరు వెలుపలకి పంపేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బడిలో చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని మాధవరం పంచాయతీకి చెందిన ఎం.బోయపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కొద్దిపాటి వర్షానికే స్కూల్ ప్రాంగణం నీటితో నిండి క్లాస్ రూమ్‌లో సైతం వాన నీరు చేరుతోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు తల్లిదండ్రులు విన్నవించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడప్పుడు పడుతున్న వర్షాలకే ఈ పరిస్థితి ఉంటే వర్షాకాలంలో మరింత అవస్థలు తప్పవని, త్వరితగతిన అధికారులు సమస్యకు పరిష్కారం కావాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక సెల్ ఏర్పాటు: జెసి

గ్రంథాలయాల అభివృద్ధిపై మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని అన్ని బ్రాంచ్ లైబ్రరీలలో వివిధ పోటీ పరీక్షల కొరకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలిని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రంథాలయల్లో పోటీ పరీక్షలకు, చిన్నపిల్లలకు ఉపయోగపడే విధంగా పుస్తకాలు అందుబాటులోఉంచుకోవాలని తెలిపారు. ప్రతి బ్రాంచ్ లైబ్రరీలలో పోటీ పరీక్షలు సంబంధించిన ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని, ఆ గదిలో మంచి వెలుతురు, తాగునీరు, టాయిలెట్ సౌకర్యం ఉండే విధంగా ఉండాలని ఆదేశించారు. వచ్చే గురువారం జిల్లాలోని లైబ్రేరియన్‌లతో ప్రత్యేక టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాల విద్యార్థులు కచ్చితంగా గ్రంథాలయాలలో ఒక గంట ఉండే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని అందుకు డీఈఓకు, ఎంఈఓకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ కార్యాలయం నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. డిఐపిఆర్ఓ ఎన్.వేలాయుధం, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి ఆజాద్ అహ్మద్ మెంబర్లుగా, డిపిఓ కార్యాలయం ప్రతినిధి, డీఈఓ కార్యాలయం ప్రతినిధి పాల్గొన్నారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సిపిఎం

పలమనేరు ఆర్డీవోతో చర్చిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ప్రాంతంలో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ డివిజన్ అధికారితో సిపిఎం నాయకులు బుధవారం చర్చించడం జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ఆధ్వర్యంలో నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్ గుప్తా ఆర్‌డివోను ఆమె ఛాంబర్‌లో కలిసి భూసమస్యలపై మాట్లాడారు. గంగవరం, పెద్దపంజాణి, పలమనేరు, వీకోట మండలాల్లో అత్యధికంగా భూసమస్యలు ఉన్నాయన్నారు. గతంలో కొందరు అధికారుల తప్పిదాల వలన అన్ని రకాల అర్హత ఉన్న నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని, భూమి కలిగిన వారి పట్టాలను మరొకరి పేరుపై మార్చి పట్టాలు ఇచ్చారని, దీంతో నిజమైన భూయజమానులు నష్టపోతున్నారని తెలిపారు. పెద్దపంజాణి మండలంలో గౌరమ్మకు ఉన్న పట్టాను రద్దు చేసి వేరే వారికి ఇవ్వడం దారుణమన్నారు. వారు ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోవడంతో సమస్యను సిపిఎం దృష్టికి తీసుకువచ్చారని, సిపిఎం నాయకులు అధికారులతో మాట్లాడగా వారు స్పందించి వేరే స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే గంగవరం మండలంలో నరసింహులు స్థలాన్ని కూడా అదే పరిస్థితి అని, ఇది కూడా అడిగిన తర్వాత వేరే చోటు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇలాంటివి భూ సమస్యలు కోకొల్లలుగా పలమనేరు ప్రాంతంలో ఉన్నాయని ఇలాంటి వాటిని మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓను కోరారు. పై అధికారులు సానుకూలంగా స్పందిస్తున్నప్పటికీ మండలాల్లోని తహశీల్దార్లు, కింది స్థాయి సిబ్బంది స్పందించకపోవడం దారుణమన్నారు. ఆర్‌డిఓ స్పందిస్తూ గతంలో జరిగిన తప్పిదాలు ఇకపై జరగకుండా చూస్తామని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పారిశుద్ధ్య పనులు తనిఖీ చేస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరు, నీటి సరఫరాపై కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు. గురువారం ఉదయం కమిషనర్ నగరంలోని వీరభద్ర కాలనీ, తేనెబండ రోడ్డు, నీవానది పరిసర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో కాలువల్లో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీరభద్ర కాలనీలో నీటిసరఫరాపై స్థానికులతో మాట్లాడి ఆరా తీశారు. నీటి సరఫరా సక్రమంగా జరుగుతోందా, ఇంటింటి చెత్తసేకరణ సక్రమంగా చేస్తున్నారా అని స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎంహెచ్వో డాక్టర్ పి.లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేయండి

నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం తేనెబండ గంగాకాలనీలోని ఈఎల్ఎస్ఆర్ ట్యాంకును తనిఖీ చేశారు. ట్యాంకు లోపల భాగంలో శుభ్రం చేసిన తీరును పరిశీలించారు. క్లోరినేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. ట్యాంకు పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం స్థానికంగా మరమ్మతులకు గురైన బోరు మోటారును పరిశీలించి సత్వరం రిపేరు చేయించాలని అధికారులను ఆదేశించారు. డీఈ శ్రావణి, ఏఈ లోకేష్ కమిషనర్ వెంట ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేత

రైతులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నష్టపరిహారాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గురువారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. ఇందులో యాదమరి మండలం నయిరెడ్డిపల్లెకు చెందిన ఎం.బాలభాస్కర్‌కు రూ.7వేలు, రామిరెడ్డికి రూ.6,500లు, పి.రాజేశ్వరికు రూ.8వేలు, ఎం.రాజారెడ్డికి రూ.6 వేలు, కొరివారిపల్లె కే.వరదరాజుకు రూ.3వేలు, వెలుతురు చెనుకు చెందిన ఏ.చిన్నబ్బకు రూ.6వేలు, టెకుమంద గ్రామానికి చెందిన బి.కోమలకు రూ.4వేలు, కుమార్ రాజ్‌కు రూ.5వేలు, బాలజీకి రూ.7వేలు, ఎం. బోయపల్లి గ్రామానికి చెందిన రాజారెడ్డికి రూ.14వేలు మొత్తంగా రూ.66,500లు నష్టపరిహారంకు చెందిన చెక్కులను రైతులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపరిహారం ద్వారా బాధిత రైతులకు కొంత ఆదరణ లభిస్తుందని, రైతుల సంక్షేమంకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. యాదమరి, పూతలపట్టు, బంగారుపాళ్యం, తవణంపల్లె మండలాల అధ్యక్షులు మురార్జీ యాదవ్, దొరబాబు చౌదరి, ఎన్‌పి. ధరణీ నాయుడు, వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

కేసుల్లో పురోగతి సాధించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి- చౌడేపల్లి: వివిధ కేసుల్లో వెంటనే పురోగతి సాధించాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ సూచించారు. గురువారం డివిజన్ స్థాయిలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలతో వచ్చేవారిపట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులు, ఫోక్సో కేసులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజంలో జరుగుతున్న చట్టవ్యతిరేక విధానాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పలమనేరు డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్లో 6 నెలల నేర పరిశోధన కేసులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, గంగవరం, పుంగనూరు, చౌడేపల్లి పరిధిలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌తో పొంచి ఉన్న ప్రమాదం

- పట్టించుకోని అధికారులు
- విద్యుత్ లైను మార్పు కోసం ఎదురు చూస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండలం మేలుమాయి గ్రామంలో 11 కెవి విద్యుత్తు లైను నడి గ్రామంలో ఇళ్ళ మీద ఉండడంతో గ్రామస్తులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న భయంతో బతుకుతున్నారు. ఆరు నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన సాయితేజ అనే యువకుడు ప్రమాదవశాత్తు ఈ లైన్ టచ్ కావడంతో ఆసుపత్రిపాలై మూడునెలల పాటు ఆసుప్రతిలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడని తెలిపారు. పలమనేరులో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఈ సమస్యపై గ్రామస్తులు అర్జీ ఇవ్వడం జరిగిందని, కలెక్టర్, ఎమ్మెల్యేలు అప్పటికప్పుడే స్పందించి వెంటనే విద్యుత్తు లైను మార్చాలని మండల విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అయితే విద్యుత్తు అధికారులు తమ సంస్థ సొంత నిధులతో ఖర్చు చేసే వెసులుబాటు లేదని, గ్రాముస్తులు రుసూ చెల్లిస్తే ఆ లైను మారుస్తామని చెప్పడంతో గ్రామస్తులు రుసుము చెల్లించారు. కాగా ఆరు నెలలు గడిచినా ఇంతవరకు విద్యుత్ అధికారులు స్పందించలేదని, ఎప్పుడు ఎవరికి ఏ ప్రమాదం జరుగుతుందో అన్న భయాందోళనలో జీవనం సాగిస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా నాయకులు అన్నూరి ఈశ్వర్, దళిత నాయకులు ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని సంబంధిత అధికారులు స్పందించి ఈ విద్యుత్ లైన్‌ను మార్చాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఇంటింటికి సుపరిపాలన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరుగుతోందని తెదేపా నాయకులు చెప్పారు. "సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గురువారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గుడిపాల మండలంలో తెదేపా నాయకులు గట్రాళ్లమిట్ట, నంగమంగళం, మండికృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలో మండల స్థాయి తెలుగుదేశం నాయకులు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులు నచ్చి గట్రాలమిట్ట సర్పంచి గుణవతి, వార్డు సభ్యులు జేపీ నాగం తెదేపా కండువా కప్పుకున్నారు. వెలుగాంబట్టి బీటీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో సుబ్బానాయుడు, అనిల్, బాలాజీ నాయుడు, ప్రతాప్ నాయుడు, నాగరాజు యాదవ్, హరి, గుర్రప్ప నాయుడు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తవణంపల్లి: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గంలో జోరుగా సాగుతుంది. తవణంపల్లె మండలం, ఎగువ తడకర, ఎల్.యన్.పురం, గాజులపల్లె, రామనాథంపురం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరగొండ రోడ్డు నుండి లక్ష్మీ నారాయణపురం వరకూ రూ.59లక్షలతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, మండల క్లస్టర్ ఇంఛార్జ్, సునీల్ చౌదరి, మాజీ మండల అధ్యక్షులు దిలీప్ కుమార్, ఏ.గొల్లపల్లి సర్పంచ్ ప్రవీణ్ కుమార్, చిట్టెమ్మ, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రొంపిచర్ల: ద్విచక్ర వాహనం ఢీకొని ఆర్టీసీ మెకానిక్ మృతి చెందిన సంఘటన రొంపిచర్ల మండలం బొమ్మయ్యగారిపల్లి గ్రామం పజులుపేట వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కదిలిపేటకు చెందిన మోహన్ బాబు పీలేరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రొంపిచర్ల బస్టాండ్ నుండి రాత్రి 10 గంటలకు రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న తన ఇంటికి రోడ్డుమీద నడిచి వెళ్తుండగా, నగరి హరిజనవాడకు చెందిన యువకుడు నూతన్ కుమార్ (16) తన ద్విచక్ర వాహనంతో వేగంగా వచ్చి ఢీకొట్టడంతో మోహన్ బాబు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ సూర్యనారాయణ, ఎస్సై బి.సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో ప్రేమ జంటకు వివాహం

ప్రజాశక్తి - రొంపిచర్ల: ఓ ప్రేమ జంటకు పోలీసులు స్టేషన్‌లోనే వివాహం చేసిన సంఘటన గురువారం రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో జరిగింది. సిఐ సూర్యనారాయణ, ఎస్సై బి.సుబ్బారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కె.వి.పల్లి మండలం మహల్‌రాజుపల్లికు చెందిన వంశీ (24), నందిని (19) ఇద్దరు ప్రేమించుకున్నారు. అయితే వీరి పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఇంట్లో చెప్పకుండా పారిపోవాలని ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అదే సమయంలో రొంపిచర్లలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి విచారించగా అసలు విషయం తెలుసుకున్నారు. తాము ప్రేమించుకున్నామని, పెళ్లి చేసుకోవడానికి వెళ్తున్నామని చెప్పడం, వారిద్దరూ మేజర్లు కావడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఇద్దరి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పిలిపించి వారిని ఒప్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోనే దండలు మార్పించి వివాహం జరిపించి కె.వి.పల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బందికి అప్పగించారు. ప్రేమ జంటకు రక్షణ కల్పించాలని సీఐ సూర్యనారాయణ వారికి సూచించారు.

భూమి సరిహద్దులపై ఘర్షణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్థం-2 రెవెన్యూ గ్రామం సర్వేనెంబర్ 1154/2 విస్తీర్ణం 0.85 సెంట్లు దరఖాస్తు పట్టా చంద్రశేఖర్ భార్య శాంతమ్మ పైన పట్టా ఉంది. సదరు భూమికి పక్కన ఉన్న పట్టాదారైన మాజీ సర్పంచ్ చంద్రప్ప పొలం సరిహద్దుల విషయంగా ఇరు వర్గాల ఘర్షణ పడ్డారు. దీంతో శాంతమ్మ కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా మండల తహశీల్దార్ ప్రసన్నకుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఇరువర్గాల వారినికి సంబంధించిన భూ రికార్డులను తీసుకుని వచ్చిన ప్రభుత్వ రికార్డులను పరిశీలించి సర్వే చేయించి హద్దులు నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి- చౌడేపల్లి : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు... మండలంలోని పంచాయతీ కేంద్రం లదిగంకు చెందిన రమేష్ భార్య నాగలక్ష్మి (28) ఈనెల 14 నుంచి ఇంటి నుంచి కనిపించకుండా పోయిందని, బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద వెతికిన ఫలితం లేకపోవడంతో ఆమె భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. కాగా నాగలక్ష్మి పుంగనూరు మండలం నక్కబండకు వెళ్లి అక్కడి నుంచి తప్పిపోయినట్లు తెలుస్తోందని ఆయన వివరించారు.

ముగిసిన లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమం గురువారం చిత్తూరులోని అరుణాచల జూనియర్ కాలేజీలో ఘనంగా ముగిసింది. పాఠశాల నిర్వహణలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ శిక్షణా శిబిరం నిర్వహించబడింది. ఈ ముగింపు కార్యక్రమానికి సహాయ ప్రాజెక్టు సమన్వయకర్త వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై, ఉపాధ్యాయుల లోపలి నాయకత్వాన్ని వెలికితీసేందుకు ఈశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రాజేంద్ర, గణపతి, గిరిజ, ఎఎంవో సుభాషిణి హాజరై ఉపాధ్యాయులను అభినందించారు. శిక్షణా శిబిరంలో ఉపాధ్యాయుల చురుకైన భాగస్వామ్యం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ శిక్షణలో పాఠశాల నాయకత్వం, బృందం నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, తరగతి నిర్వహణ, సమగ్ర విద్య వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఉపాధ్యాయులు శిక్షణ పద్ధతులకు మంచి స్పందన ఇచ్చారు. చివరగా పాల్గొన్న 262 మంది ఉపాధ్యాయులకు అటెండెన్సు సర్టిఫికేట్ అందించారు.

కొత్త రకం చెరకుతో అధిక దిగుబడి

డిప్యూటీ జనరల్ మేనేజర్ గోవిందరాజులు

చెరకు పంటను పరిశీలిస్తున్న షుగర్ ఫ్యాక్టరీ డీజీఎం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని ఎన్ఆర్ కండ్రిగ గ్రామంలోని ఆదర్శ రైతు నాగలపాటి నాగేశ్వరరాజు చెరకు తోటను సాగర్ షుగర్ ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోవిందరాజులు గురువారం పరిశీలించారు. రైతు నాటిన కో 18009 అనే రకం చెరకు పంటను, అదేవిధంగా 2009ఎ 07 చెరకు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిఎం మాట్లాడుతూ ఎక్కువ శాతం రైతులు ఈ రకం పంటపై ఆసక్తి చూపుతున్నారని, ఈ రకం చెరుకు నాటడం వల్ల అధిక దిగుబడి వస్తుందని చక్కెర శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. దాదాపుగా 4 ఎకరాల్లో కొత్త రకం చెరకు నాటిని రైతు నాగేశ్వరరాజును షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రాజా, మేనేజర్ ప్రసాద్, హేమారాజు, రైతులు చిరంజీవి, దామోదర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి: ఎస్ఈ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నాణ్యమైన విద్యుత్ అందించాలని సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. గురువారం మండలంలోని కేజీ సత్రం నలగంపల్లి విద్యుత్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్తు అందించాలని విద్యుత్ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని తెలిపారు. బకాయిలు, నగదు వసూళ్లలో పారదర్శకత పాటించి సంస్థకు నగదు చెలించే విధంగా చూడాలన్నారు. అనంతరం విద్యుత్ కేంద్రాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. డీఈఈ కొండయ్య, రూరల్ ఏఈ హేమచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు దీపం గ్యాస్ కనెక్షన్లు మంజూరు

ప్రజాశక్తి- శాంతిపురం:

మండలంలోని సొన్నేగానిపల్లె గ్రామ పంచాయతీ ఎస్‌సి కాలనీలో గురువారం ఎంపిడిఓ ఏపిఆర్ కుమార్ దీపం ప్రతిపాదిత లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడివో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండలంలో అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు దీపం గ్యాస్ కనెక్షన్లు అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రెండవ విడతగా 160 మంది లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా గ్రామసభలు నిర్వహించి గుర్తించడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైన అర్హులుగా వున్న లబ్ధిదారులు స్థానిక పంచాయతీ కార్యదర్శి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్థానిక సర్పంచ్ పుష్పా మంజునాథ్, భాస్కర్, నేత్రావతి, మునెప్ప, మధుకుమార్, పంచాయతీ కార్యదర్శి జయప్ప పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీ

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : మండలంలోని ఎరువులు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. సహయ వ్యవసాయ సంచాలకులు ధనుంజయరెడ్డి, విజిలెన్స్ ఇన్సిస్టర్ వెంకట రవి, వ్యవసాయాధికారి రాఘవేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో దుకాణాల లైసెన్స్, సైకే బుక్, బిల్ బుక్ విలువలను పరిశీలించి వాటి నమునాలను సేకరించి సామ్యత పరీక్షించుటు కొరకు ల్యాబ్‌కు పంపాలని సూచించారు. దుకాణాల్లో రైతులకు ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని దుకాణదారులకు తెలిపారు.

పలమనేరు: పలమనేరు పట్టణంలోని తూనికలు, కొలతల శాఖ అధికారులు పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. గురువారం వీధి వ్యాపారుల తూనికలు, కాటాలు చెక్ చేశారు. వాటికి సీళ్ల వేసుకోని వారు కచ్చితంగా వేసుకోవాలని సూచించారు. ఆ శాఖ ఇన్స్పెక్టర్ రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యాపారి ప్రభుత్వం అనుమతించిన కొలతల్లో కచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు. తూకాల్లో మోసాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపీటీసీకి పితృ వియోగం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం ఎంపీటీసీ, జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షురాలు ఎన్.రాధిక పురంధర్‌రెడ్డికి పితృవియోగం కలిగింది. గురువారం పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానం ధర్మకర్త, పచ్చికాపల్లం మాజీ సర్పంచ్ డాక్టర్ ఎన్. మునిరత్నంరెడ్డి (87) మృతి చెందారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పచ్చికాపల్లంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా క్రీడోత్సవాలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పిఈఎస్ వైద్యకళాశాల క్రీడాప్రాంగణంలో వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పిఈఎస్ నర్సింగ్ కళాశాల తరపున జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ అభిరామి అధ్యక్షత వహించారు. జ్యోతిప్రజ్వలనతో ప్రారంభం చేసిన క్రీడోత్సవంలో మార్చ్ పాస్ట్, క్రీడా పతాక ఆవిష్కరణ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. క్రీడాకారులు రాగద్వేషాలకు అతీతంగా, క్రీడోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'కాగితం మనసులు' షార్ట్ ఫిలిం

ప్రజాశక్తి, పలమనేరు: పట్టణంలో 'కాగితం మనసులు' షార్ట్ ఫిలిం షూటింగ్ బృందం గురువారం సందడి చేశారు. పలమనేరుకు చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫర్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు మాదేశ్ నిర్మాతగా జబర్దస్త్ నటుడు సందీప్ హీరోగా, రుచిత హీరోయిన్‌గా ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్నా ఈ షార్ట్ ఫిలింను అందరూ ఆదరించాలని యూనిట్ సభ్యులు కోరారు. గత రెండు రోజులుగా పలమనేరు పట్టణ పరిసర ప్రాంతాల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించడం జరిగినదని తెలిపారు. సమాజంలో జరిగే కొన్ని అపోహలను తొలగించే విధంగా షార్ట్ ఫిలిం చిత్రీకరించడం జరిగిందని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని రాస్ వృద్ధాశ్రమంలో గురువారం ముక్కరవాణిపల్లె సర్పంచ్ గుణవతి, లోకనాథం నాయుడు కుమారుడు జి. జ్ఞాన ప్రకాష్ మూడవ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గుణవతి లోకనాథం నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ కుమారుడు జి. జ్ఞాన ప్రకాష్ మూడవ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. పి.పురందర్ రుక్కు బాబు, గోవింద నాయుడు, మురళీకృష్ణారెడ్డి, రాస్ పర్యవేక్షకులు ప్రకాష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి: సీఐ

ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలని కల్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ అన్నారు. ఆయన గురువారం రొంపిచర్ల బస్టాండ్ కూడలిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మదనపల్లి - తిరుపతి జాతీయ రహదారిలో రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయని , వాహనాలు నడిపేవారు జాగ్రత్త వహించి నడపాలని అన్నారు. గత ఒకటిన్నర నెల కాలంలో రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత చెందారని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.25 వేలు జరిమానాతో పాటు, ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తామని తెలిపారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారి తల్లిదండ్రుల మీద కేసులు పెడతామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు. ఎక్కడపడితే అక్కడ మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సబ్ ఇన్స్పెక్టర్ బి.సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, శోభన్ బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కేసు పెట్టండి.. ఫిర్యాదుచేసిన ఆర్‌కె రోజా

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : ఇసుక, బియ్యం స్మగ్లింగ్ చేసే టీడీపీ నేతలు అడ్డంగా దొరికిపోతే వారు ఎమ్మెల్యే అనుచరులంటూ సోషల్ మీడియాలో పెట్టడం ఎందుకు తప్పవుతుం.. సోషల్ మీడియా వారిని ఎందుకు బెదిరింపులకు గురిచేసి వేధిస్తున్నారంటూ సీఐ విక్రమ్‌ను మాజీమంత్రి ఆర్కేరోజా ప్రశ్నించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆమె వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియావారిని వేధించడంపై సీఐని వివరణ కోరారు. బియ్యం స్మగ్లింగ్‌లో దొరికిన అమృతరాజ్ అనే వ్యక్తి నగరి పట్టణమంతా ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ బ్యానర్లు కట్టారని పచ్చపత్రికల్లో శుభాకాంక్షలు చెబుతూ ప్రకటనలు ఇచ్చారని ఆయన ఎమ్మెల్యేకు అనుచరుడు కాకుండా ఏమవుతాడని ప్రశ్నించారు. మహిళాలోకం అసహ్యించుకునేలా, సభ్యసమాజం సిగ్గుపడేలా ట్రోల్ చేస్తున్నారని వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిత్వ హననం చేసేలా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. అనంతరం స్టేషన్ బయటకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎక్కడ అక్రమాలు జరిగినా ఆలోచించకుండా వైఎస్సార్‌సీపీ ఖాతాలో తోసేయ్... అరెస్టు చేసి లోపలేసేయ్ అన్నదే టీడీపీ సిద్ధాంతం అన్నారు. నేడు ఇసుక తరలించేది ఒకరైతే కేసు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై పెడుతున్నారన్నారు. తప్పు ఒకరుచేస్తే కేసు ఒకరిపై పెట్టడం రెడ్‌బుక్ రాజ్యాంగంలోని చట్టాల మేరకే ఇది సాధ్యమౌతుందన్నారు. అలాగే నేడు టీడీపీ నేతలు ఇసుక అక్రమంగా తరలిస్తూ అడ్డంగా దొరికిపోతే కేసు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై పెడుతున్నారన్నారు. పదవులకోసం కాదు.. ప్రశ్నించడానికి అన్న నినాదంతో వచ్చిన పవన్ ప్రశ్నించడమే మానుకున్నారన్నారు. ఇలాంటి సుపరిపాలన ఏ రాష్ట్రంలోను లేదన్నారు. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తామన్నారు.

22న ప్రపంచ మామిడి దినోత్సవం

జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 22న చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రపంచ మామిడి దినోత్సవం జయప్రదం చేయాలని, మామిడి రైతు సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ శంకరన్, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సీజన్లో మామిడి రైతుల చేతికి అందిన పంట అమ్ముకోవడానికి పడ్డ కష్టం అంతా ఇంత కాదని, ప్రభుత్వం ప్రకటించిన రూ.12ల ధర సాధన కోసం, నెల రోజులుగా రైతు సంఘాలు, మామిడి రైతులు పోరాడాల్సి వచ్చిందన్నారు. గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను తీవ్ర వేదనకు గురిచేశారని తెలిపారు. ర్యాంపులవద్ద మరి దారుణంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రపంచ మామిడి దినోత్సవం పురస్కరించుకొని, భవిష్యత్తులో ఇలాంటి చేదు అనుభవాల్ని రైతాంగం చవిచూడకుండా ఉండేలా పటిష్టమైన విధానం అనుసరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సభలో ఫుడ్ ప్రాసెసింగ్ అధికారి చిరంజీవి చౌదరి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపి, ఎమ్మెల్యే పాల్గొంటున్నారని జిల్లాలోని మామిడి రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పలమనేరు: చిత్తూరు నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఈనెల 22వ తేదీన జరిగే ప్రపంచ మామిడి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లాల మామిడి రైతుల సంక్షేమ సంఘం కన్వీనర్ ఉమాపతి నాయుడు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని మామిడి ర్యాంపు వద్ద మామిడి రైతులతో కలిసి ప్రపంచ మామిడి దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం నాయుడు, రామచంద్ర నాయుడు, పురుషోత్తమ నాయుడు, జానకిరాం, లక్ష్మిపతి, దేవేంద్ర రెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

రేపు సీఎం చంద్రబాబు రాక

ప్రజాశక్తి- రేణిగుంట

రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు జూలై 19 వ తేదీన శనివారం తిరుపతిలో స్వర్ణాంధ్ర స్వచ్చాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో సీఎం పర్యటనలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సంబంధిత అధికారులతో సిఎం పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుపతి లో స్వర్ణాంధ్ర స్వచ్చ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్నారని, అనంతరము ప్రజా వేదిక అనంతరం ఐఐటి ఏర్పేడు కార్యక్రమంలో పాల్గొని, తిరిగి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటించు తూకివాకం వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్, కపిల్ తీర్థం, పోలీస్ పెరేడ్ గ్రౌండ్, ఐఐటి ఏర్పేడు ప్రదేశాలలో పర్యటించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ లు రవి మనోహరాచారి, వెంకట్రావు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ , రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రాధ, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను తిప్పికొడదాం

వామపక్ష ప్రజాసంఘాల పిలుపు

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న వందవాసి నాగరాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటి : జనాన్ని చైతన్యపరచి అదానీ స్మార్ట్‌మీటర్లను తిప్పికొట్టాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో వామపక్షప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కందారపు మురళి ప్రసంగించారు. జగన్ సర్కారు పోయి బాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ షాక్‌లు ఆగడం లేదన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో షాక్‌ల మీద షాక్‌లు ఇస్తూనే ఉన్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రపంచబ్యాంక్ ప్రయోగశాలగా మారిందన్నారు. యూజర్‌ఛార్జీల పేరుతో మొదలైన భారాలు ట్రూఅప్ ఛార్జీలతో కొనసాగుతోందన్నారు. ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకు విద్యుత్ బోర్డును జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ అనే మూడు ముక్కలు చేసి వాటిని తమకు నచ్చినట్లు ఆడించడానికి ఓ రెగ్యులేటరీ కమిషన్ ఇఆర్‌సిని ఏర్పాటు చేస్తూ చట్టం తెచ్చారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రపంచబ్యాంక్ సంస్కరణలు రకరకాల పేరుతో కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి గ్రాంట్, వాటా రావాలంటే వాటిని పాటించాల్సిందేనని నీతిఅయోగ్ ద్వారా ఉత్తర్వులిస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కేంద్రాలన్నీ అదానీకి కట్టబెట్టారని, మొదటిదశలో వ్యవసాయానికి మీటర్లు పెట్టడం, రెండో దశలో ఇళ్లకు బిగించే కార్యక్రమం ప్రారంభమయ్యిందన్నారు. ఎవరైనా అదానీ స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తే వ్యతిరేకించాలన్నారు. అదానీ స్మార్ట్ మీటర్ల వద్ద స్మార్ట్ ఫోన్లు రీఛార్జి చేసుకున్నట్లే ముందస్తుగా విద్యుత్ కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుందన్నారు. స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ దశలవారీ కార్యక్రమాలు ఆగస్టు 5వరకూ కొనసాగుతాయన్నారు. నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నపుడు 'పగలగొట్టండి' అని మాట్లాడిన మాటలనే మనం ఆచరణలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, ఎం మాధవ్, పి సాయి లక్ష్మి, పి బుజ్జి, నరేంద్ర, వెంకటరత్నం, అరుణ, డిహెచ్‌పిఎస్ నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PULURU PURANDAR (Old Name), S/o P Reddappa, residing at D.No. 5-9, Kotha palli Village, Bangaru palyam Post, Bangaru palyam Mandal, Chittoor Dist, AP hereby declare that I have changed my name as PULURU PURANDAR BABU (New Name) for all future purposes.

సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పలమనేరు, క్యాంపు కోర్టు - కుప్పం
హెచ్ .ఎం.ఓ.పి .నెంబరు . 7/2025
మధ్య:
రుక్కమ్మ వైఫ్ అఫ్ జ్యోతికుమార్ చిరునామా 5-3, గుండ్లపల్లి గ్రామం, కమతమూరు పోస్ట్, కుప్పం మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
...పిటిషనర్
మరియు:
జ్యోతికుమార్ సన్ అఫ్ సంతూరప్ప, చిరునామా చ 5-3, గుండ్లపల్లి గ్రామం, కమతమూరు పోస్ట్, కుప్పం మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
...రెస్పాండెంట్
రెస్పాండెంట్ కు కోర్టు నోటీసు
పిటిషనర్ రెస్పాండెంట్ను విడాకులు కోరుతూ పై కోర్టులో పిటిషనర్ దాఖలు చేసి ఉన్నారు. పై పిటిషన్లో 21-07-2025 తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 గంటలకు మీరుగాని, మీ వకీలుగాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపకోరి ఉన్నారు. లేనంతట పెటిషనర్ కోరినట్లు పిటిషన్ మంజూరు చేయబడును.
వాయిదా తేదీ : 21-07-2025
ఇట్లు
పి వీ మధుసూదన్
పెటిషనర్ తరుపున వకీలు కుప్పం,చిత్తూరు (ఆంధ్రప్రదేశ్)